మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన వైఎస్సార్టీపీ మాజీ నేత పచ్చిపాల వేణుయాదవ్. చిత్రంలో ఎమ్మెల్యే తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

సీఎం కేసీఆర్‌తోనే ప్రజలకు న్యాయం

- బీఆర్ఎస్‌లో చేరిన కోదాడ వైఎస్సార్టీపీ నేత వేణుయాదవ్

హైదరాబాద్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ): సీఎం కేసీఆర్ నేతృత్వంలోనే రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకు సరైన న్యాయం జరుగుతుందని బీఆర్ఎస్ పార్టీలో చేరిన వైఎస్సార్టీపీ మాజీ నేత పచ్చిపాల వేణుయాదవ్ స్పష్టం చేశారు. ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకొని కాంగ్రెస్‌కు మద్దతివ్వాలన్న షర్మిల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆ పార్టీ కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జి పదవికి, ఆ పార్టీకి వేణుయాదవ్ బుధవారం రాజీనామా చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొల్లకురుమలకు గొర్రెలను పంపిణీ చేస్తూ, గ్రామీణ కులవృత్తులను సీఎం కేసీఆర్ పరిరక్షిస్తున్నారని కొనియాడారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో వైఎస్సార్ విగ్రహాలను ఇక్కడి కాంగ్రెస్ నాయకులే కూల్చి, తగులబెట్టారని గుర్తుచేశారు. అందుకే వైఎస్సార్ అభిమానిగా కాంగ్రెస్‌కు మద్దతివ్వలేక బయటికి వచ్చానన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా తెలంగాణ కోసం పోరాడి రాష్ట్రాన్ని సాధించిన సీఎం కేసీఆర్‌ను, బీఆర్ఎస్ పార్టీని ప్రజలు కాపాడుకుంటారని స్పష్టం చేశారు. తాను ఎమ్మెల్యే తక్కెళ్లపల్లి రవీందర్‌రావు నేతృత్వంలో బీఆర్ఎస్‌లో చేరినట్టు వేణుయాదవ్ చెప్పారు.

గురువారం కొండగల్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డికి మద్దతుగా మంత్రి కే తారకరామారావు నిర్వహించిన రోడ్ షోకు పోటెత్తిన జనం

కేటీఆర్ రోడ్ షోలో అపశ్రుతి

- సడన్ బ్రేక్ వేయడంతో విరిగిన బస్సు రెయిలింగ్
- కిందికి ఒరిగిన కేటీఆర్, జీవన్‌రెడ్డి, సురేశ్‌రెడ్డి
- నేలపై పడిన ఎంపీ సురేశ్‌రెడ్డికి స్వల్ప గాయాలు
- చిన్న గాయాలను లెక్కచేయకుండా కొడంగల్‌లో ప్రచారానికి వెళ్లిన మంత్రి కేటీఆర్

నిజామాబాద్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ఆర్మూర్: ఆర్మూర్‌లో మంత్రి కేటీఆర్ రోడ్ షోలో స్వల్ప అపశ్రుతి చోటుచేసుకున్నది. రోడ్ షోలో భాగంగా ఓపెన్‌టాప్ బస్సులో ప్రయాణిస్తుండగా, డ్రైవర్ సడన్‌బ్రేక్ వేయడంతో రెయిలింగ్ ఒక్కసారిగా విరిగిపోయింది. స్వల్పంగా గాయపడిన కేటీఆర్ వాటిని లెక్క చేయకుండా కొడంగల్‌లో ఎన్నికల ప్రచారానికి బయల్దేరి వెళ్లారు. అసలు ఏం జరిగిందంటే.. ఆర్మూర్‌లో రోడ్ షో అనంతరం హెలిప్యాడ్ వద్దకు వెళ్లే మార్గంలో ఓపెన్ టాప్ బస్సుపైకి ఎక్కిన మంత్రి కేటీఆర్, ఎంపీ సురేశ్‌రెడ్డి, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, స్థానిక నాయకులు ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. బస్సు బందోబస్తు మధ్య సాగుతున్న క్రమంలో ఎదురుగా వ్యక్తి రావడంతో బస్సు డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. బస్సు ఒక్కసారిగా కుదుపునకు గురైంది. బస్సుపైనా ఎక్కువ మంది ఉండటంతో బ్యాలెన్స్ తప్పి రెయిలింగ్ విరిగిపోయింది. రెయిలింగ్ పట్టుకొని నిలబడిన నేతలంతా కిందికి వంగిపోయారు. కేటీఆర్‌ను ఆయన గన్‌మెన్ పట్టుకోవడంతో ఆగిపోయారు. జీవన్‌రెడ్డి, డాక్టర్ మధుశేఖర్ కూడా బస్సుపైనే ఆగారు. కానీ, ఎంపీ సురేశ్‌రెడ్డి మాత్రం బ్యాలెన్స్ తప్పి రోడ్డుపై పడటంతో స్వల్ప గాయాలయ్యాయి. అప్రమత్తమైన పోలీస్ సిబ్బంది వారందరినీ కిందికి దించారు. ఎంపీ సురేశ్‌రెడ్డిని స్థానిక దవాఖానకు తరలించి చికిత్స అందించారు. గాయపడిన కేటీఆర్ వాటిని పట్టించుకోకుండా కొడంగల్‌లో ఎన్నికల ప్రచారానికి వెళ్లారు. అదృష్టవశాత్తు తనకు ఏమీ జరుగలేదని, తన ఆరోగ్య పరిస్థితిపై ఎలాంటి ఆందోళన అవసరం లేదని, కార్యకర్తలు, అభిమానులకు సూచించారు.

చిన్న గాయమే: కేటీఆర్

ఆర్మూర్ ఎన్నికల ర్యాలీ ఘటనలో చిన్న గాయం తప్ప మరేమీ కాలేదని మంత్రి కేటీఆర్ తెలిపారు. కాలు మీద రెండు చిన్న గాయాలు అయ్యాయి తప్ప మరేమీ కాలేదని గురువారం ట్విట్టర్‌లో పేర్కొన్నారు. తర్వాత కొడంగల్ ఎన్నికల ప్రచారంలో కూడా పాల్గొన్నానని తెలిపారు. తన ప్రమాదంపై ఆందోళన చెందుతూ ఫోన్లు చేసిన, మెస్సేజ్ పంపిన వారికి కేటీఆర్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

టేక్ కేర్ రామన్న: కవిత

ఆర్మూర్ ఎన్నికల ర్యాలీలో జరిగిన ఘటపై మంత్రి కేటీఆర్‌కు సోదరి, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఫోన్ చేశారు. ఘటన గురించి ఆరా తీశారు. తాను బాగున్నానని కేటీఆర్ తనతో చెప్పారని కవిత ట్వీట్ చేశారు. కేటీఆర్ ఉత్తేజంగా ఎన్నికల ప్రచారం కొనసాగిస్తారని తెలిపారు. టేక్ కేర్ రామన్న.. అంటూ ట్వీట్ చేశారు.

..జైలుకెళ్లే దొంగా?

> మొదటిపేజీ తరువాయి...

అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డికి మద్దతుగా రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.50 లక్షలతో అడ్డంగా దొరికిన దొంగ రేవంత్‌రెడ్డి అని, తొందర్లోనే జైలుకెళ్లి చిప్పకూడు తినడం ఖాయమని చెప్పారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కొడంగల్ పరువు తీసిన దొంగ రేవంత్ అని మండిపడ్డారు. ఏదో సామెత చెప్పినట్టు తెగబలిసిన కోడి చికెన్ షాప్ ముందు తొడగొట్టినట్టుగా రేవంత్‌రెడ్డి.. సీఎం కేసీఆర్‌తో పోటీ పడ్తున్నాడని, ముందు కొడంగల్‌లో నరేందర్‌రెడ్డిపై గెలిచి చూపించాలని సవాల్ చేశారు. 20 ఏండ్ల క్రితం రేవంత్ రెడ్డి గోడలకు సున్నాలు వేసుకొని బతికేవాడని, బ్లాక్‌మెయిల్, బ్రోకర్, సెటిల్‌మెంట్ దందాలతో కోట్లు సంపాదించిన చిల్లర దొంగ అంటూ విరుచుకుపడ్డారు. పీసీసీ పదవిని కొనుక్కొని, కాంగ్రెస్ టికెట్లను అమ్ముకొని సొమ్ము చేసుకొంటున్నాడని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి లీడర్లను కొనవచ్చేమో గానీ తెలంగాణ బిడ్డలను కొనే దమ్ము లేదని వ్యాఖ్యానించారు. ఓటుకు నోటు దొంగ రేవంత్‌రెడ్డి వస్తే.. కొడంగల్‌ను ప్లాట్లు చేసి అమ్ముకుంటాడని దుయ్యబట్టారు.

కాంగ్రెస్ వచ్చే.. కరెంట్ పోయే!

కర్ణాటకలో కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయిందని, కాంగ్రెస్‌ను గెలిపించుకున్నందుకు కన్నడ ప్రజలు నేడు చెంపలేసుకుంటున్నారని, తెలంగాణ బిడ్డలు ఆ తప్పు చేయవద్దని కన్నడ ప్రజలు ఇక్కడికి వచ్చి విజ్ఞప్తి చేస్తున్నారని కేటీఆర్ తెలిపారు. ఇటీవల కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ వికారాబాద్ జిల్లా, తాండూర్‌లో మాట్లాడుతూ కాంగ్రెస్‌ను గెలిపిస్తే 5 గంటల కరెంటు ఇస్తామని చెప్పడంతో ప్రజలు సభ నుంచి వెళ్లిపోయారని చెప్పారు. తెలంగాణలో ఇప్పటికే 24 గంటల కరెంటు సరఫరా కొనసాగుతుంటే, కాంగ్రెసోళ్లు 5 గంటల కరెంటు ఇస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. తెలంగాణలో రేవంత్‌రెడ్డి కూడా ఇదే బాపతని, వ్యవసాయానికి 3 గంటల కరెంటు సరిపోతుందన్న ప్రబుద్ధుడని ఎద్దేవా చేశారు. సిగ్గులేని కాంగ్రెస్ తెలంగాణను తామే ఇచ్చామని చెప్పుకొంటున్నదని, ఎంతోమంది బిడ్డల బలిదానంతోనే తెలంగాణ సాధ్యపడిందని గుర్తుచేశారు.

> 'వందల మంది చావులతో బంధవిముక్తులైన మన తెలంగాణను ఢిల్లీ, గుజరాత్ గులాంల చేతుల్లో పెడితే వాళ్ల మోచేతి నీళ్లు తాగే దుస్థితి వస్తుంది. ఒకనాటి కాకతీయ సామ్రాజ్యం కావాలా? కర్ణాటక సామంతుల రాజ్యం కావాలా?. మనమంతా కుటుంబ సభ్యులం.. ఇంట్లో చిన్నచిన్న తగాదాలుంటే మనమే పరిష్కరించుకోవాలి. తియ్యటి మాటలు చెప్పి.. ప్రలోభాలకు లొంగితే దీర్ఘకాలం బాధపడాల్సి వస్తుంది'.
> - కేటీఆర్

దేశంలోనే తెలంగాణ ఆదర్శం

తొమ్మిదిన్నరేండ్లలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది దేశానికే ఆదర్శంగా నిలిచిందని కేటీఆర్ చెప్పారు. రైతుబంధు కావాలా.. రాబందులు కావాలా.? ప్రజల మధ్యన ఉండే నాయకుడు కావాలా? చేతులూపే నాయకుడు కావాలో ప్రజలు తేల్చుకోవాలని కోరారు. ఈ రోడ్ షోలో మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, కొడంగల్ బీఆర్ఎస్ అభ్యర్థి పట్నం నరేందర్ రెడ్డి, షాబాద్ జడ్పీటీసీ అవినాష్ రెడ్డి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కులమనే కుంపట్లు, మతంపేరుతో మంటలు లేవు..

తొమ్మిదిన్నర ఏండ్లుగా కులమనే కుంపట్లు, మతంపేరుతో మంటలు కేసీఆర్ పెట్టలేదని కేటీఆర్ గుర్తుచేశారు. కేవలం అభివృద్ధే కులం, సంక్షేమమే మతమంటూ సబ్బండవర్గాల అభ్యున్నతి కోసం సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు. ఎన్నికలు రాగానే ఈ రోజు కొందరు కులమంటూ, మరికొందరు మతమంటూ వస్తున్నారని విమర్శించారు. అభివృద్ధి, సంక్షేమమే నా కులమంటున్న కేసీఆర్‌ను గెలిపిద్దామా? లేక కులపిచ్చోళ్లు, మతపిచ్చోళ్లున్న ప్రతిపక్షాల ఉచ్చులో పడి ప్రమాదాన్ని కొనితెచ్చుకుద్దామా? అన్ని ప్రశ్నించారు. తనకు రాజకీయ భిక్షనిచ్చిన సిరిసిల్లను మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. సిరిసిల్ల ప్రజలు గర్వంగా తలఎత్తుకునే విధంగా రాష్ట్రంలోనే జిల్లాను అభివృద్ధిలో ముందుండేలా చేశానని తెలిపారు. ప్రతి ఒక్కరూ తామే అభ్యర్థినని అనుకొని నాలుగుసార్లు ఇక్కడి ప్రజలు గెలిపించారని చెప్పారు. ఐదోసారి జరుగుతున్న ఎన్నికల్లోనూ తమ బిడ్డగా ఆశీర్వదించి భారీ మెజార్టీ అందించాలని కోరారు.

> 'బక్క పలుచని కేసీఆర్‌ను ఎదుర్కొనేందుకు మోదీ, అమిత్‌షా, 15 మంది ముఖ్యమంత్రులు, 15 మంది కేంద్ర మంత్రులు, రాహుల్ గాంధీ, ఖర్గే, ప్రియాంక గాంధీ ఇలా ఎందరో ఢిల్లీ నుంచి వస్తున్నారు. ఎందరొచ్చినా భయపడేదిలేదు. రెండు సార్లు ఒంటరిగానే ఎదుర్కొన్నాం. ఇప్పుడూ సింగిల్ గానే ముందుకుపోతాం. ఒక్క చాన్స్ కావాలని కాంగ్రెస్ వారు కోరుతున్నారు, ఇప్పటి వరకూ 11 సార్లు వారికి అవకాశం ఇస్తే ఏం చేశారు? ప్రశ్నించారు. కాంగ్రెస్ వాళ్లకు కర్ణాటక నుంచి బీజేపీ వాళ్లకు గుజరాత్ నుంచి డబ్బులు వస్తున్నాయి. ఆ డబ్బుతో మాయమాటలు చెప్పి ఓట్ల కోసం కుట్రలు చేయనున్నారు. వారి కుట్రలను ప్రజలు ఓట్లతో తిప్పికొట్టాలి. సంక్రాంతి పండుగకు గంగిరెద్దులోల్ల మాదిరిగా కాంగ్రెస్ నాయకులు ఊరూరుకు వస్తున్నారు. 50 సంవత్సరాలు అధికారంలో ఉండి కరెంటు, సాగునీరు ఇవ్వక ఎంతో గోసపెట్టి గొంతెండపెట్టినోళ్లు ఇప్పుడు వచ్చి మాయమాటలు చెప్తే నమ్మి మోసపోవద్దు. ప్రజలు ఒక్కసారి ఆలోచించాలి!'
> -కేటీఆర్

రేవంతే ద్రోహి

> మొదటిపేజీ తరువాయి...

ప్రజలందరికీ తెలుసని అన్నారు. ఆయన రేవంత్‌రెడ్డి కాదని, రేటెంతరెడ్డి అని సొంత పార్టీ నేతలే విమర్శిస్తున్నట్టు చెప్పారు. ఎమ్మెల్యే సీట్లను రూ.వందల కోట్లకు అమ్ముకున్న చరిత్ర రేవంత్‌దని ధ్వజమెత్తారు. కొడంగల్‌లో ఓడిపోయిన వ్యక్తి పాలకుర్తిలో మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. 'హెలికాప్టర్‌లో వచ్చే బతుకా నీది? బాబ్లీ కోసం నేను, టీడీపీ ఎమ్మెల్యేలు పోరాటం చేసి జైలుకు వెళ్తే రేవంత్‌రెడ్డి తప్పించుకొన్నాడు. తెలంగాణ కోసం టీడీపీ ఎమ్మెల్యేలు రాజీనామా చేస్తే, బాబు చెప్పిన మాటలు విని పారిపోయాడు. పిచ్చిపిచ్చిగా మాట్లాడితే గుణపాఠం తప్పదు' అని ఎర్రబెల్లి హెచ్చరించారు. ఓటుకు నోటు దొంగ రేవంత్‌రెడ్డి తన గురించి మాట్లాడటం తగదని హెచ్చరించారు. ఓటుకు నోటు కేసుతో తనకు సంబంధం లేదని స్పష్టం చేశారు. తాను ప్రజల మద్దతుతో ఏడు సార్లు గెలిచానని, కాంగ్రెస్ గాలిలోనూ ఎన్నికైనట్టు చెప్పారు. సీఎం కేసీఆర్ మాదిరిగా వరుసగా గెలిచిన ఎమ్మెల్యేనని ఆయన తెలిపారు. తనకు వందల ఎకరాల ఆస్తి ఉన్నదని, 250 ఎకరాల భూమిని రామకృష్ణ మఠానికి అప్పగించిన విషయాన్ని గుర్తుచేశారు. రేవంత్ కుటుంబ చరిత్ర తనకు తెలుసని అన్నారు. వాల్ పెయింటర్, ప్రింటింగ్ ప్రెస్ నుంచి రూ. లక్షల కోట్లు ఎలా సంపాదించావు? అని ప్రశ్నించారు. కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న రేవంత్ ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు.

రేవంత్ కండకావరం

- పాలకుర్తి సభలో రెచ్చిపోయిన టీపీసీసీ చీఫ్
- కార్యకర్తలను బూటుకాలుతో తన్నిన రేవంత్

జనగామ, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ) : పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అహంకార ధోరణి.. బలుపు చేష్టలతో మరోసారి రెచ్చిపోయారు. వేదిక మెట్లపై తనకు అడ్డుగా ఉన్న పార్టీ కార్యకర్తలను హీనంగా చూస్తూ బూటుకాళ్లతో తన్నుతూ పరుష పదజాలంతో మాట్లాడటంతో పార్టీ శ్రేణులు విస్తుపోయాయి. గురువారం జనగామ జిల్లా పాలకుర్తిలో కాంగ్రెస్ అభ్యర్థి పక్షాన ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న రేవంత్ మాట్లాడుతుంటే జిందాబాద్‌లతో అడ్డుతగిలిన ప్రజలను సైతం ఏకవచనంతో సంబోధిస్తూ పలుమార్లు అసహనం వ్యక్తం చేశారు. సభ ముగిసిన తర్వాత వేదిక మెట్ల నుంచి కిందకు దిగుతుండగా కొందరు కార్యకర్తలు ఆయన కాళ్లను తాకేందుకు ప్రయత్నించారు. దీంతో వారిపై తీవ్ర ఆగ్రహాన్ని ప్రదర్శించిన రేవంత్ పక్కకు జరగండంటూ బూతులు తిడుతూ తన బూటు కాళ్లతో పలుమార్లు తన్నిన వీడియో నెట్టింట్లో వైరల్ అవుతున్నది. అధికారం రాకముందే ఇంత అహంకారాన్ని ప్రదర్శిస్తున్న రేవంత్ తీరుపై పార్టీ కార్యకర్తలు, నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రాపార్టీ తెలుగుదేశం ఏజెంట్‌గా, టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి తెలంగాణ బిడ్డలపై ప్రదర్శించిన దురహంకారాన్ని ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారు. ఓటుకు నోటు కేసులో పట్టుబడ్డ దొంగను పీసీసీ పీఠంపై కూర్చోబెడితే ఎన్నో ఏండ్లుగా పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలను కాలుతో తన్నుతారా? ఇంత బలుపా? ఇంత కండకావరమా? అధికారంలోకి రాకముందే ఇంతలా రెచ్చిపోతుంటే ఇక ప్రజలు కాంగ్రెస్ చేతికి రాష్ట్రాన్ని అప్పగిస్తే రౌడీల రాజ్యం, రాక్షస పాలన కాదా? అంటూ మండిపడుతున్నారు. తెలంగాణ బిడ్డను కాలుతో తన్ని అవమానిస్తాడా? ఇదేం పార్టీ? ఆయనేం నాయకుడు? ఇట్లాంటి వాడి చేతికి అధికారం ఇస్తే రాష్ట్రం గతి ఏం కాను? అంటూ పార్టీ సీనియర్లు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారం కోసం అడ్డగోలు కూతలు కూస్తున్న రేవంత్ తీరుపై కాంగ్రెస్ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ సీనియర్లను దారి దాపుల్లోకి రాకుండా పెత్తనం చెలాయిస్తుండగా, బీసీ, ఎస్టీ, మైనార్టీలకు పార్టీ టికెట్లు దక్కకుండా అమ్ముకున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం అవుతున్నది. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి పార్టీకి పునాదిలాంటి కార్యకర్తల పట్ల ఇంత హీనంగా.. నీచంగా ప్రవర్తించిన తీరుపై నిరసన వ్యక్తమవుతున్నది.

హోంశాఖ మంత్రి మహమూద్ అలీ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన జహీరుద్దీన్ తదితరులు

టీజేఎస్ నేత జహీరుద్దీన్ బీఆర్ఎస్‌లో చేరిక

హైదరాబాద్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ జన సమితి (టీజేఎస్) హైదరాబాద్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు జహీరుద్దీన్ బీఆర్ఎస్‌లో చేరారు. గురువారం బీఆర్ఎస్ హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పుస్తే శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆయన కారెక్కారు. జహీరుద్దీన్‌కు హోంశాఖ మంత్రి మహమూద్ అలీ గులాబీ కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు మరో 100 మంది బీఆర్ఎస్‌లో చేరారు.

రాచకొండ జోలికొస్తే రణరంగమే!

> మొదటిపేజీ తరువాయి...

ప్రాంతానికి ఎంతో చారిత్రక నేపథ్యం ఉంది. అనేక గ్రామాల ప్రజలు ఇక్కడి భూములను నమ్ముకుని ఏండ్లుగా జీవిస్తున్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని రాచకొండ, తిప్పాయిగూడ, అల్లాపుం, కడీలబావితండా, రాచకొండ తండా, ముచ్చర్లకుంటతండా, పటేల్‌చెర్వుతండా తదితర గ్రామాల ప్రజలు ఇక్కడి భూములపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వీరిలో అత్యధికులు గిరిజనులే. 2008లో కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వేల ఎకరాలను సేకరించి ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. పాత నల్లగొండ జిల్లాలోని నారాయణపురం ప్రాంతంతో పాటు రంగారెడ్డి జిల్లాలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని మంచాల మండలాల్లోని రాచకొండ పరిసర ప్రాంతాల గుట్టల ప్రాంతంలో ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ ఏర్పాటు కానుందని అధికారికంగా ప్రకటనలు కూడా వచ్చాయి.

ఎగసిపడిన ఉద్యమం

ఫైరింగ్ రేంజ్ ప్రకటన వెలువడిన వెంటనే రాచకొండ ప్రాంతం ఒక్కసారిగా అట్టుడికిపోయింది. ఈ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ నల్లగొండ జిల్లాలోని నారాయణపురం, అల్లాపురం, అల్లాపురంతండా, తుంబాయి తండా, ఐదుదోనలతండా, రాచకొండ తండా, రంగారెడ్డి జిల్లాలోని తిప్పాయిగూడ, పటేల్‌చెర్వుతండా, కడీలబావితంగా, ఆరుట్ల తదితర గ్రామాల రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఫైరింగ్ రేంజ్ కోసం సర్వే చేసేందుకు కేంద్రం నుంచి అధికారులు కూడా రంగంలోకి దిగారు. సంస్థాన్ నారాయణపురం మండల పరిధిలోని ఐదుదోనల తండా వద్ద సర్వే కోసం వచ్చిన అధికారులపై ఈ ప్రాంత ప్రజలు ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. అధికారులపై పెట్రోలు పోసి, కర్రలు, రాళ్లతో దాడులకు దిగారు. భయభ్రాంతులకు గురైన అధికారులు సర్వే మొదలుపెట్టకుండానే వెనుదిరిగి పోయారు. ఆ తర్వాత కూడా రాచకొండవ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమించారు. ప్రజా ఉద్యమంతో వెనక్కి తగ్గిన కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చివరకు ఆ ప్రతిపాదనను ఉపసంహరించుకుంది.

రేవంత్ వ్యాఖ్యలపై కన్నెర్ర

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ల్యాండ్ పూలింగ్ ద్వారా రాచకొండలో 50వేల ఎకరాలు సేకరించి విదేశీ కంపెనీలకు ఇస్తామన్న రేవంత్ వ్యాఖ్యలపై రాచకొండ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ భూముల జోలికొస్తే గత ఉద్యమ స్ఫూర్తితో కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతామని, రణరంగం తప్పదని హెచ్చరిస్తున్నారు.

బయటపడిన రేవంత్ నిజస్వరూపం

ఎన్నికలకు ముందే రేవంత్‌రెడ్డి తన నిజస్వరూపాన్ని బయటపెట్టేశారు. అధికారం చిక్కితే పచ్చని రాచకొండను కబ్జా చేస్తానని ముందే ప్రకటించారు. కొండలు, గుట్టలు, లోయలు, గుహలు, గోపురాలతో అలరారే రాచకొండ వైభవాన్ని పిప్పి చేస్తానని బాహాటంగానే చెప్పారు. రైతుల భూములు అడ్డికి పావుశేరు లెక్క గుంజుకుంటానని మనసులోని మాటను బయటపెట్టేశారు. ఉమ్మడి నల్లగొండతోపాటు రంగారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాల్లో సుమారు 32 వేల ఎకరాల్లో రాచకొండ విస్తరించి ఉంది. ఉమ్మడి నల్లగొండలో 14,765 ఎకరాల్లో ఉండగా, ఎక్కువ భాగం రాచకొండ గ్రామ రెవెన్యూ పరిధిలోనే ఉంది. వీటిలో 2,217 ఎకరాల పట్టా భూములు, 2,956 ఎకరాల ప్రభుత్వ భూమి, 8,945 ఎకరాల అటవీభూమి ఉంది. మిగతాది రంగారెడ్డిలో విస్తరించి ఉంది. ఇప్పుడీ భూములపై కన్నేసిన రేవంత్ అధికారంలోకి వస్తే ఆ భూములను లాక్కుంటామని ప్రకటించి రాచకొండ వాసులను భయభ్రాంతులకు గురిచేశారు. స్వరాష్ట్ర సాధనకు ముందు పడావు పడిన భూములతో అగమ్యగోచరంగా ఉన్న రాచకొండ రైతుల జీవితాలు ఇప్పుడిప్పుడే కుదుటపడుతున్నాయి. సాగునీరు అందడం, రైతుబంధు పెట్టుబడి సాయంతో సాగుచేసుకుని బతుకుతున్నారు. శివన్నగూడెం రిజర్వాయర్ పూర్తయితే మంచి రోజులు తమవేనని భావిస్తున్న వేళ రేవంత్ వ్యాఖ్యలు స్థానికులను ఆందోళనలోకి నెట్టేశాయి. రాచకొండ మొత్తం 32 వేల ఎకరాలైతే 50 వేల ఎకరాలు ఎక్కడి నుంచి సేకరిస్తారని ప్రశ్నిస్తున్నారు. రేవంత్ వ్యాఖ్యలను బట్టి చూస్తే నారాయణపురం, చౌటుప్పల్, గట్టుప్పల్, మర్రిగూడ, మాల్, మంచాల తదితర మండలాల్లోని పలు గ్రామాలు కూడా బలయ్యే అవకాశం ఉంది. రేవంత్‌రెడ్డి అనుచరులు, బినామీలు రాచకొండ పరిధిలో పెద్ద ఎత్తున భూములు కొనుగోలు చేసినట్టు తెలుస్తున్నది. రేవంత్‌రెడ్డికి దండుమైలారం సమీపంలో 50 ఎకారల భూమి ఉందని, అక్కడ ఎకరం సుమారు కోటి నుంచి కోటిన్నర పలుకుతున్నదని చెప్తున్నారు.

పర్యాటకం, పర్యావరణానికి పాతర

రాచకొండ పర్యాటకంగా అభివృద్ధి చెందుతున్నది. ఇటీవల పర్యాటకుల తాకిడి విపరీతంగా పెరిగింది. హైదరాబాద్‌కు దగ్గరగా ఉండడంతో టూరిజం కారిడార్‌గా మారుతున్నది. రాచకొండ కోటను సందర్శించే పర్యాటకుల సంఖ్య పెరుగుతున్నది.ఇక్కడ సుమారు వందకుపైగా ఆలయాలున్నాయి. నారాయణపురం మండల పరిధిలోని సరళమైసమ్మ ఆలయానికి నిత్యం భక్తులు పోటెత్తుతుంటారు. సినిమా షూటింగ్‌లు కూడా పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. పర్యాటక అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.80 లక్షలు విడుదల చేసింది. రేవంత్ కుట్రలు అమలైతే పర్యాటకంతోపాటు పర్యావరణం కూడా దెబ్బతినే అవకాశం ఉన్నది.

మా భూముల జోలికి ఎవరొచ్చినా సహించం

ఎవరో ఒకాయన మా భూములను తీసుకుంటామన్నాడని తెలిసింది. మా భూముల దగ్గరకు ఎవరొచ్చినా ఊరుకోం. లేచినప్పటి నుంచి రాత్రి వరకు భూముల వద్దే కష్టం చేసుకుంటూ పొట్టపోసుకుంటున్నం. మాకున్న భూమిని దున్నుకుని బతకడమే కాకుండా మా పిల్లలను మంచిగ చదివించుకుంటున్నాం. మా భూముల జోలికి ఎవరొచ్చినా సహించం.

- జర్పుల బచ్యా, కడీలబావి తండా

రైతుబంధుతో పంటలు పండుతున్నయ్!

మా భూమిలో సాటెడు జొన్నలు పండినా చాలు. రేవంత్‌రెడ్డి ఇష్టమొచ్చినట్టు మాట్లాడితే ఇక్కడ ఎవరూ చూస్తూ ఊరుకోరు. మేము కేసీఆర్ ఇస్తున్న రైతుబంధుతో మా పొలంలో పంటలు సాగుచేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నాం. అలాంటి భూముల జోలికి ఎవరైనా వస్తే ఉరికించి కొడతాం.

- మేగావత్ శ్రీనివాస్, పటేల్‌చెర్వు తండా

కేసీఆర్ వచ్చినంక కట్టెలు కొట్టుడు బంధైంది!

గతంలో పొలంలో సాగు చేసుకోవడానికి పెట్టుబడులు లేక కట్టెలు కొట్టేందుకు ఇతర జిల్లాలకు కూలీలుగా వెళ్లేవాళ్లం. తెలంగాణ వచ్చినంక కేసీఆర్‌సారు ఇస్తున్న రైతుబంధుతో పంటలు సాగు చేసుకుని ఇక్కడే బతుకుతున్నం. అలాంటి బంగారు భూములను ఎవడో వచ్చి గుంజుకుంటామని, కంపెనీలకు ఇస్తామని చెపితే కడుపు మండిపోతుంది.

- మేగావత్ శంకర్ నాయక్, పటేల్ చెర్వుతండా

భూములిచ్చి మేమెలా బతకాలి

మాకున్నదే భూముల ఆధారం. ఆ భూములు అమ్మేసి మేమెలా బతకాలి. ఎవరొచ్చినా భూములు మాత్రం ఇవ్వం. భూమికోసం ఎన్నో ఏండ్లుగా కొట్లాడి సాధించుకున్నం. బంగారంలా చూసుకుంటుంటే భూములకోసం కాంగ్రెస్ పెద్దాయన వచ్చి తీసుకుంటామంటే మేమెలా ఇస్తం. మా భూములు ఎవరికీ ఇవ్వం. మా భూములు మాకే ఉండాలి.

- భజన్‌నాయక్, రాచకొండ తండా